క్లుప్తంగా

లయన్స్ సేవలు ప్రశంసనీయం



మొక్కలు నాటుతున్న లయన్స్ జిల్లా గవర్నరు డా. పంకభాస్కర్

ఉంగుటూరు: చేబ్రోలు లయన్స్ క్లబ్ సేవలు ప్రసంశనీయమైనవని లయన్స్ జిల్లా గవర్నర్ డా. పంక జాక్షన్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆడిటోరియంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి అడపా శోభరాణి నివేదిక సమర్పించారు. సంవత్సర కాలంలో నిర్వహించిన సేవాకార్యాక్రమాలు వివరించారు. లయన్స్ ఆడిటోరియం రెండో అంతస్తు నిర్మాణాన్ని లయన్స్ గవర్నరు పరిశీలించారు. లయన్స్ ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



కైకరం జాతీయరహదారి వద్ద ప్రారంభించిన మజ్జిగ చలివేంద్రం

ఉంగుటూరు: వేసవి తీవ్రత ఎక్కువుగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇళ్ల నుంచి అత్యవసరమైతే గాని బయటకు రావద్దని డైమండ్స్ లయన్స్ క్లబ్ డైరెక్టరు కోనా శ్రీనినవాసు అన్నారు. ఆదివారం కైకరం జాతీయ నాయకుల విగ్రహాల వద్ద లయన్స్ అధ్యక్షుడు కోనా హనుమాన్ ఆధర్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, లయన్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్నొన్నారు.

బాంసెఫ్ శిక్షణ తరగతులు

చింతలపూడి : బహుజన భావజాలం, సిద్ధాంతం మాత్రమే నేటి సమస్యలకు పరిష్కారం అని బాంసెఫ్ జిల్లా కన్వీనర్ అలుగుల సాయిరాజు అన్నారు. చింతలపూడిలో దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయీ ఫెడరేషన్ (బాంసెఫ్) నియోజక వర్గ శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్, పూలే, గౌతమ బుద్దుని బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో పాలపర్తి బాలాజి, వీరదాస్, కాకర్ల సత్యన్నారాయణ, బీవీఎస్ఎన్ రాజు, విజయానంద్, కె.శ్రీనివాస్, బి. ప్రసాద్‌రాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన హాసం క్లబ్ కార్యక్రమం



హాసం క్లబ్ సీనియర్ సభ్యుడు తల్లాప్రగడ సుబ్బారావును సన్మానిస్తున్న సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే ప్రత్యేక హాస్య కదంబ కార్యక్రమం స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు జోకులు చెప్పడం, వివిధ చిత్రాల్లోని హాస్య సన్నివేశాలను వివరించి నవ్వులు పూయించారు. అనంతరం పలువురు సభ్యులు పలు సినీ గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హాసం క్లబ్ సీనియర్ సభ్యుడు తల్లాప్రగడ సుబ్బారావును ఘనంగా సత్కరించారు. హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్ఆర్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీహరి కోటి, ఎస్.బాబి, ఎం.బెనర్జీ, బి.నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

138 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద నేత్రవైద్యశాలకు చెందిన వైద్యులు 138 మంది పేదలకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. అలాగే 32 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు. బొల్లిసెట్టి సురేష్ కుమార్, కంది బాలకృష్ణ, పి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- బావాయిపాలెం లబ్ధిదారులకు స్థల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉదయం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా బావాయిపాలెం గ్రామానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే ముందుందన్నారు. మండలంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే బావాయిపాలెం వైఎస్సార్ జగనన్న కాలనీలో పూర్తిస్థాయి విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. అన్ని లేఅవుట్లలో తాగునీరు, రహదారుల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణంలో చొరవ చూపి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇంటికి విద్యుత్, తాగునీటి కుళాయి కనెక్షన్‌ల వెంటనే ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ బాధ్యులు పుప్పాల కన్నబాబు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సర్పంచ్ ముత్యాల పద్మావతి బాలాజీ, ఎంపీటీసీ ముత్యాల సుబ్బలక్ష్మి, పార్టీ అధ్యక్షులు నాగిశెట్టి సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ బొబ్బిలి వెంకటేశ్వరరావు, మండల రైతు విభాగం అధ్యక్షులు గొట్టుముక్కల విశ్వనాధరాజు, సంకు నాగేషు, తాహసీల్దారు బి. సాయిరాజు తదితరులున్నారు.

ముగిసిన నిత్య సహాయ మాత ఉత్సవాలు



ఉండ్రాజవరంలో నిత్యసహాయ మాత ప్రతిమతో ర్యాలీ నిర్వహిస్తున్న ఫాదర్ డేవిడ్‌రాజు

దెందులూరు: పోతునూరు శివారు ఉండ్రాజవరంలో నిత్యసహాయ మాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ. డేవిడ్‌రాజు ప్రత్యేక నిత్య పూజాబలి అర్పించారు. ఉండ్రాజవరం ఆర్‌సీఎం సంఘ పెద్దలు, యువత, మరియదళ సభ్యులు, నిత్యసహాయ మాత ప్రతిమతో ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీ

ఏఎంసీ ఛైర్మన్‌గా అప్పన ప్రసాద్, ఇతర కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన ఛైర్మన్, బోర్డు సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు తదితరులు

పెదవేగి: ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆదివారం అప్పన ప్రసాద్ జంక్షన్‌లోని ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించి భారీ బైక్ ర్యాలీ ద్వారా పెదవేగి మండలం లక్ష్మీపురంలోని మార్కెట్‌యార్డ్‌కు చేరుకున్నారు. అడుగడుగునా పార్టీ శ్రేణులు నాయకులపై పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్టీ జెండా ఊపుతూ యువతలో మరింత ఉత్సాహం రేకెత్తేలా ర్యాలీ నిర్వహించారు.

భారీ ర్యాలీ

దెందులూరు: మండలంలో ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ ఛైర్మన్ కాటి సుధాకర్, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కన్నుల పండువగా ర్యాలీ జరిగింది. కార్యకర్తలు, నాయకులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు వైఎస్సార్‌సీపీ జెండాను పట్టుకుని ఉత్సాహంగా నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీతో ప్రమాణస్వీకారానికి తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పనప్రసాద్, యువ నేత కాటి సుధాకర్‌కు ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంతో నాలుగు మండలాల్లో నూతనోత్సాహం నెలకొంది.

దెందులూరులో ఏఎంసీ డైరెక్టర్ శ్యామలాదేవికి సన్మానం

దెందులూరులో ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన పులిపాటి శ్యామలాదేవికి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు తొత్తడి వేదకుమారి, కొలుసు గణపతిరావు, కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, పులిపాటి ఆనంద్, తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, వన్నెకూటి సుందరం, గోరిపర్తి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పూల దండలు, శాలువాలు, బొకేలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



బైక్‌ర్యాలీగా ప్రమాణ స్వీకారోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏఎంసీ ఛైర్మన్ ప్రసాద్

అభయాంజనేయ స్వామికి పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నాయకులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అధ్యక్షతన జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి పెదవేగి మండలం లక్ష్మీపురానికి ప్రమాణ స్వీకార వేదిక వద్దకు తరలి0వెళ్లారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు చిన్నాల ఝాన్సీ ఏసుపాదం, ఎంపీటీసీ బుద్దేరామసీత, ఆలయ చైర్మన్ నెర్సు నాగభూషణం, కంభంపాటి సుబ్రహ్మణ్యం, మరీదు రెడ్డియ్య, గుణపూరు మహేష్, బోదవరపు వెంకటేశ్వరరెడ్డి కంభాల నాగరాజు పాల్గొన్నారు.

పెనుగాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం



లక్ష్మీపురంలో భారీ ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం

పెదవేగి : వాతావరణం ఒక్క సారిగా మారి ఆదివారం రాత్రి వీచిన పెనుగాలుల తీవ్రతకు పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయని ట్రాన్స్‌కో పెదవేగి ఏడీ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 32 విద్యుత్ స్తంభాలు, విరిగి పడ్డాయని, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయని, కండక్టర్ (విద్యుత్ వైరు) చాలా వరకు ధ్వంసమైందని ఆయన చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని, విద్యుత్ స్తంభాలను కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి, పాడైన తీగలను సరిచేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, సోమవారం నాటికి అన్ని చోట్లా పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు. లైన్లపై నుంచి వెళ్తున్న చెట్లను తొలగించి, లైన్లకు ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



పోతునూరు గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి జాన్‌బాబు

దెందులూరు: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోతునూరు, దెందులూరు గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారులు జాన్‌బాబు, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణ తరగతుల్లో భాగంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. కంప్యూటర్ల బేసిక్‌పై ఒకరోజు అవగాహన కల్పించి కంప్యూటర్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

భీమడోలు: నైతిక విలువలతో కూడిన విద్య ద్వారా విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తారని విశ్రాంత అధ్యాపకుడు ఈతకోట సుబ్బారావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థి దశ నుంచి నైతిక విలువలతో కూడిన విద్య అనే అంశంపై చిన్నారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత అధ్యాపకుడు ఈతకోట సుబ్బారావు, రిటైర్డ్ హెచ్‌ఎం వైఆర్‌కే శర్మ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్ భవ్యశ్రీ పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా ఆత్మీయ సమ్మేళనం



భీమడోలులో ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో కలిసి పాల్గొన్న 1982-83 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982–83 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. 40 ఏళ్ల తర్వాత విద్యనభ్యసించిన జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దకు పూర్వ విద్యార్థులు చేరుకుని మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వారంతా తమ పిల్లలు, మనుమలు, మనవరాళ్లతో రోజంతా గడిపి సందడి చేసారు. తాము చదువుకున్న బడిని చూసి మురిసిపోయారు. చదువుకున్న రోజుల్లో పాఠశాల పరిసరాల్లో తిరుగాడిన ప్రాంతాలను చూసి ఆనందోత్సాహల్లో తేలియాడారు. అనాడు తమకు చదువులు చెప్పి, తీర్చిదిద్దిన గురువులు శ్రీరామ్‌మూర్తి, దత్తులను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలు, ఉత్తమ విద్యార్థులకు తగిన ప్రోత్సాహకాలను అందించాలని వారంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేసారు. వారంతా గ్రూపు ఫోటోలు దిగారు. దీనితో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం ఏర్పడింది.

రాజీవ్ గాంధీ సేవలు శ్లాఘనీయం

భీమడోలు: దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వి.వసంత రావు, వై.నరసింహారావు, వై.దుర్గారావు, పి.ప్రభాకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : పెదవేగి మండలం జగన్నాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. సోమవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సతీష్ కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: రైతుల సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ కోరారు. మానవతా దృక్పథంతో రైతులను ఆదుకోవాలని క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు శాశ్వతంగా పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఆయన కోరారు. ఆదివారం ఉండ్రాజవరంలో రైతులతో సమావేశం నిర్వహించారు.

చేబ్రోలు రజక సంఘం అధ్యక్షుడిగా అప్పారావు



చేబ్రోలులో రజకుల సంఘ సమావేశంలో పాల్గొన్న చిలకలపల్లి కట్లయ్య తదితరులు

ఉంగుటూరు: చేబ్రోలుకు చెందిన చీపరుపల్లి అప్పారావును పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం చేబ్రోలు రజకుల సంఘ సమావేశానికి హాజరైన కట్లయ్య మాట్లాడుతూ ఐక్యతగా మెలిగి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చేబ్రోలు రజక సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా చీపరుపల్లి అప్పారావు, వైస్ ప్రెసిడెంటుగా మాండ్రుజు రవి, ప్రధాన కార్యదర్శిగా యండమూరి శ్రీను, ట్రెజరరుగా మద్దాల శ్రీను, జాయింట్ సెక్రటరీగా జొన్నాడ వెంకటేశ్వరరావు, సభ్యులుగా పిప్ప రమణ, వెలసూరి నాగరత్నం ఎన్నికయ్యారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి



భీమడోలు ఆసుపత్రి వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న వైద్యులు, మానవత సభ్యులు

భీమడోలు: ఎయిడ్స్, హెచ్ఐవీ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వత్తుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాండిల్ ర్యాలీ, ప్రదర్శన చేసారు. తొలుత హెచ్ఐవీతో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, హెచ్ఐవీని సమాజం నుంచి దూరంగా చేయాలని నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేసారు. వివక్ష రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదామంటూ నినదించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జి.బాబూరావు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ అవగాహనతో సాధ్యమన్నారు. సమాజం నుంచి తరిమి కొట్టాలన్నారు. ఐసీటీసీ కౌన్సలర్ సింహాద్రి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అనేక సేవలు, పింఛన్ వంటి పథకాలు అందిస్తోందన్నారు. ఎన్‌జీవో సంస్థ మేనేజర్ శిరీషా, మానవత మండల చైర్మన్ గుల్లా నూకరాజు అప్పారావు, మానవత సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి చేయూత

పిల్లల పేరున బ్యాంకులో రూ. 2 లక్షలు డిపాజిట్



నగదు డిపాజిట్ బాండ్‌లను చూపుతున్న నాగబాబు పిల్లలు

ద్వారకాతిరుమల: కోవిడ్ వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో గ్రామ ప్రజలకు విశిష్ట సేవలందించి, ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన ఒక పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆ గ్రామస్తులు చేయూతనిచ్చారు. వివరాల్లోకి వెళితే. మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మానికల నాగబాబు(35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గుణ్ణంపల్లి పంచాయతీ పరిధిలో గత కొన్నేళ్లుగా నాగబాబు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. కోవిడ్ విలయతాండవం చేసిన సమయంలోనూ తన సేవలను ప్రజలకు అందించారు. నాగబాబు మృతి చెందడంతో పలువురు గ్రామస్తులు అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో దాతలు ముందుకు రావాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. వీటికి స్పందించిన పలువురు దాతలు మృతుడి కుటుంబానికి పలు రకాలుగా సహాయాన్ని అందించారు. దాంతో పాటు సేకరించిన రూ. 2 లక్షల నగదును నాగబాబు కుమార్తె బాలనాగ సత్య అంజలి పేరున, అలాగే కుమారుడు రిష్యేంద్ర పేరున గుణ్ణంపల్లిలోని సొసైటీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వీటిని పిల్లలు మేజర్లు అయిన తరువాత మాత్రమే తీసుకునేలా డిపాజిట్ చేసినట్టు దాతలు తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ ముల్లంగి వెంకట రామిరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, గౌతంరెడ్డి, అనూష్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వలంటీర్లకు పురస్కారాలు

కొయ్యలగూడెం : వలంటీర్లకు పురస్కార కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తారన్నారు. మొత్తం 383 మంది వలంటీర్లకు గాను 378 మందికి సేవా మిత్ర పురస్కారాలు, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలకు ఎంపిక అయ్యారన్నారు.

విజ్ఞానంతో పాటు వినోదం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హేలాపురి చిల్డ్రన్ క్లబ్, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల్లో విజ్ఞానం పెంచి వినోదం పంచుతోందని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో రెండో రోజు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో తెలుగు భాష, సులభ గణితాలను తులసి, సీహెచ్ జగదీష్ నేర్పారు. డ్రాయింగ్‌ను చిత్రకారులు మజ్జి కాంతారావు నేర్పారు. 100 మంది విద్యార్థులు శిక్షణ పొందారు.

మద్ది అంజన్న సన్నిధిలో...

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని ఆదివారం జంగారెడ్డిగూడెం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కాళహస్తి రాజరాజేశ్వరీ తేజశ్వి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను ఈవో కొండరాలవు మేజిస్ట్రేట్ రాజరాజేశ్వరీ తేజశ్వికి అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరీ లైఫ్ – మేరా స్వచ్ఛ సహార్ అనే కార్యక్రమంలో భాగంగా పర్యావరణ అనుకూల అలవాట్లను, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కలిప్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ త్రిబుల్ ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో వలంటీర్లను భాగస్వాములను చేస్తూ త్రిబుల్ ఆర్ సెంటర్లకు వస్తువులను అత్యధికంగా సేకరించిన వలంటీర్లకు నగదు బహుమతి అందిస్తామన్నారు. ఈనెల 24న రెడ్యూస్ కార్యక్రమంలో భాగంగా వాడేసిన పాతబట్టల సేకరించాలని, 25న మళ్లీ వాడుకోవటానికి ఉపయోగపడే పుస్తకాలు, ఆటబొమ్మలు, పాత ఇంటిపాత్రలు సేకరించాలని, 26న రీసైక్లింగ్‌లో వాడేసిన పేపర్లు, అట్టలు, ప్లాస్టిక్ కవర్లు సేకరించి త్రిబుల్ ఆర్ సెంటర్లకు అందజేయాలన్నారు. అధిక పరిమాణంలో సేకరించిన వలంటీర్లకు నగదు బహుమతులు అందజేస్తామని కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. మొదటి బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.5వేలు, రెండవ బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.3వేలు, మూడవ బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. వీరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5న జరిగే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. డ్వాక్రా సభ్యుల సహకారంతో త్రిబుల్ ఆర్ సెంటర్లకు వస్తువులను ఎక్కువగా సేకరించిన రిసోర్స్ పర్సన్స్‌ను ఎంపిక చేసి నగదు బహుమతి అందిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలు చొప్పున అందిస్తామని కమిషనర్ తెలిపారు.